## ఈ వారం కథ

-ప్రసాద్ తోట

**ఏం బాబాయ్! ఎలా వున్నావు?**

**కొన్ని పలకరింపులు గుండెలో గడ్డ కట్టిన మబ్బుల్ని తునాతునకలు చేసి, కన్నీళ్ళుగా చీలుస్తాయి.**

రాఘవరావు బాబాయి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. ఇలా రా...! ఒంటరినా...! మీ పిన్ని చూశావా... ఎంత పని చేసిందో! నన్ను ఒంటరిని చేసి వెళ్ళిపోయింది దుఃఖంతో ఆయన గొంతు పూడుకుంది.

నాకూ కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.

ఆయన నాకు సొంత బాబాయి కాదు, ఏదో దూరపు బంధువు అవుతాడు.

నా చిన్నతనంలో ఆయన ప్రేమ వివాహాన్ని మా నాన్నే దగ్గరుండి చేయించాడు. వాళ్ళు మా పక్కింట్లోనే ఉండేవారు.

నా భోజనం కంచం తీసుకుని, వాళ్ళింటి కెళ్ళేవాడ్ని. కరెంటు పోయినప్పుడు, వెన్నెల వెలుతురులో కూర్చుని, భోం చేసిన చక్కటి జ్ఞాపకాలెన్నెన్నో ఇప్పటికీ నా కళ్ళ ముందు మెదులుతున్నాయి.

వాళ్ళు సినిమాకి వెళ్తుంటే, నేనూ పేచీ పెట్టి, వాళ్ళతో సినిమాకి వెళ్ళేవాడ్ని.

పిన్నికి పాటల పుస్తకాలంటే మహా సరదా! థియేటర్‌లో అమ్మే పాటల పుస్తకాలు కొని, ఓ పాత తోలుపెట్టెలో దాచేది.

మధ్యాహ్నపు వేళలో... ఆ పుస్తకాలు పట్టుకుని నేనూ, పిన్ని పాటలు పాడుకునేవాళ్ళం.

పిన్నికి పుట్టిన పిల్లల్ని నా చేతుల మీద ఆడించాను. మాకు పుట్టకపోయినా వీడు నా పెద్దకొడుకు అనేది పిన్ని నా గురించి.

రాఘవరావు బాబాయి నాకు లెక్కలు, ఇంగ్లీషు, సైన్స్ చెప్పేవాడు. ఆయన వేసిన పునాది వల్లే నేనీనాడు విదేశాలు వెళ్ళి, ఇంజనీర్‌గా ఇంత దర్జాగా బతకగలుగుతున్నాను.

కొన్నేళ్ళ తర్వాత మాకు వేరే వూరు ట్రాన్స్‌ఫర్ అయి, వెళ్ళిపోయాం. అయినా రాఘవరావు బాబాయి, పిన్ని నుమ్మల్ని... ముఖ్యంగా నన్ను మర్చిపోలేరు. ప్రతి ఏడాది నా పుట్టిన రోజుకి తప్పకుండా చందమామ పుస్తకంలోని సీరియల్ బైండ్ చేసి, పంపించేది పిన్ని.

నా బాల్యానికి సరిపడే ప్రేమని, వాత్సల్యాన్ని పంచిన ఆ దంపతులంటే నాకెప్పటికీ గౌరవం - అభిమానం!

అందుకే పిన్ని పోయిందంటే, నేను తట్టుకోలేక పోయాను.

సారీ బాబాయ్! కబురు తెలిసినా, వెంటనే రాలేక పోయాను

దగ్గరి వాళ్ళే పట్టించుకోని ఈ రోజుల్లో నువ్వు అభిమానంతో వచ్చావు! అదే నాక్కాస్త ఉపశమనం అంటూ రాఘవరావు బాబాయి తన గదిలోకి తీసుకెళ్ళాడు.

పిన్ని లేని వెలితి, ఒంటరితనం ఆ ఇంట్లో కొట్టొచ్చినట్లు కనపడుతోంది.

అమెరికా నుంచి నువ్వొక్కడివే వచ్చావా?

లేదు - లీల కూడా వచ్చింది. పిల్లల్ని తీసుకుని, వాళ్ళ అమ్మగారి వూరెళ్ళింది. నేను మిమ్మల్ని, ఇంకా మన వాళ్ళని కలుద్దామని వచ్చాను అన్నాను.

చందూ, వైజయంతి ఎక్కడున్నారు? ఎలా వున్నారు? బాబాయిని ఆ విషాదపు మూడ్ నుంచి బయటికి తీసుకురావాలని ప్రయత్నిస్తూ, అడిగాను.

వైజయంతి వాళ్ళు చాంద్‌పూర్‌లో సెటిలయ్యారు. చందూ నెల్లూరులో వుంటున్నాడు. అంతా బాగానే ఉన్నారు బాబాయి ఆ మాటలు చాలా మొక్కుబడిగా చెప్పాడు. అందులో ఆత్మీయతగాని, ఆసక్తిగాని ధ్వనించ లేదు.

మీరెందుకు ఒంటరిగా? ఇదే ఇంట్లో వుంటే పిన్ని పదేపదే గుర్తొస్తుంది. చందూ దగ్గరికి వెళ్లి వుండిపోతే మీ బాధా తీరుతుంది, కాస్త కాలక్షేపమవుతుంది అన్నాను.

బాబాయి నవ్వాడు. పెరిగి, వేరు కాపురాలు పెట్టిన పిల్లల్ని అమ్మల్ని ఇష్టపడతారేమో కాని... నాన్నల్ని కాదు! వాళ్ళ దృష్టిలో నాన్నలు ఫనికిమాలిన వాళ్ళు!

అదేంటి?

అమ్మ అయితే ఇంటి పనుల్లో, వంట పనుల్లో సాయం



చేస్తుంది. పిల్లల ఆలనా పాలనా చూస్తుంది. నాన్నేం చేస్తాడు?

ఆ మాట నన్ను కలిచివేసింది.

ఛా... చందూ అలా అనుకునేవాడు కాదు

చిన్నతనంలోలాగే, పెద్దయ్యాక కూడా వుండరు కదా! ఒకే ఇంట్లో వుండి, అవమానాల పాలయ్యేకన్నా, దూరంగా వుండి అభిమానాన్ని అయినా మిగుల్చుకోవాలి కదా అంటూ ఒక్క క్షణమాగి-

నాకు బి.పి, షుగర్ రెండూ వున్నాయి. నా కోసం ప్రత్యేకంగా వంటలో శ్రద్ధ తీసుకోవాలి. ఇక్కడ వున్నన్నాళ్ళూ వేరుగా వండటానికే చందూ భార్య విసుక్కునేది.

జీవితంలో చివరి వరకూ తోడుగా వుండేది భార్యాభర్తలు మాత్రమే - ఒకరికొకరు!

ఈ రోజుల్లో కుటుంబమంటే భార్యాబిడ్డలు మాత్రమే! ఆ కుటుంబంలో అమ్మలకు, నాన్నలకు చోటు లేదు చెబుతుంటే బాబాయి స్వరం రుద్ధమైంది.

ఇంతకాలం పిన్ని సేవల మీద, ప్రేమ మీద ఆధారపడ్డ బాబాయికి ఈ ఒంటరితనం నిజంగా దుర్భరం!

భోం చేస్తున్నంతసేపు బాబాయి పిన్ని విషయాలు చెబుతూనే ఉన్నాడు.

నేను నా దారిన ఆలోచిస్తూనే ఉన్నాను. తమ యవ్వనకాలమంతా పిల్లల భవిష్యత్ కోసం, తిన్నా తినకపోయినా, సొంత సరదాలు తీర్చుకున్నా - లేకపోయినా పట్టించుకోకుండా పని చేశారు.

ఈ ముసలి వయసులో - వారిని ఆదుకోవలసిన, ఆశ్రయమివ్వాల్సిన బాధ్యత పిల్లలకు లేదా? అనురాగం లేకపోతే మానెయ్, కనీసం కృతజ్ఞత అయినా లేకపోతే ఎట్లా? ఇంత స్వార్థం ఎక్కడ నుంచి వచ్చింది వీళ్ళకు?

• • •

సాయంత్రం హోటల్ రూమ్ నుంచి బయటకొచ్చి, నేను పుట్టి పెరిగిన ఆ వూరి రోడ్ల మీద పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ తిరుగుతున్నాను.

ఆ రోజు రాత్రే లీల వాళ్ళ వూరు వెళ్దామని రిజర్వేషన్ చేయించుకున్నాను. ఈ కొద్దిగంటల్లోగా వూరుని చుట్టెయ్యాలి.

అనుకోకుండా అమ్మవారి కోవెలలో కోకిల కలిసింది. బాగా లావయింది. ముఖం మాత్రం చిన్నప్పటిలాగే ఉంది. ముఖ్యంగా గడ్డం కింది ఆ మచ్చ...

కోకిల వాళ్ళు మా ఇంట్లో మేడ మీది పోర్షన్‌లో అద్దెకి వుండేవాళ్ళు. మళయాళీ కుటుంబం. ఆ వూరిలోనే సెటిలయ్యారు. కోకిల చిన్నప్పుడు చాలా ముద్దుగా, బొద్దుగా వుండేది.

వాళ్ళ అమ్మగారు భగవతి ప్రతిరోజు నూనె గుడ్డతో కోకిలకి దిష్టి తీస్తూండేవారు.

ఒకరోజు రాత్రి దిష్టి తీస్తుంటే పక్కనే వున్న నా చేయి తగిలి, ఆ గుడ్డ వెళ్ళి, కోకిల ముఖం మీద పడింది. గడ్డం కింద చర్మం కాలిపోయింది.

అప్పట్లో ప్లాస్టిక్ సర్జరీ లేదు కాబట్టి - ఆ మచ్చ ఇప్పటికీ అలాగే ఉండిపోయింది.

ఇన్నేళ్ళ తర్వాత నన్ను గుర్తుపడుతుందా? పలకరించాక, గుర్తు పట్టకపోతే, ఎంత ఇబ్బందికరం?

ఈ డైలమాలో నేను వుండగానే, కోకిలే నన్ను గుర్తుపట్టి పలకరించింది నువ్వు గోపివి కదూ?

అవునన్నాను.

కుశల ప్రశ్నలు, ఆరాలు - అన్నీ అయ్యాక ఇంటికి రమ్మని పిలిచింది కోకిల.

ఇద్దరమూ ఆటో ఎక్కాం. మీ అమ్మగారెక్కడున్నారు? అనడిగాను దారిలో.

నాన్నా అన్నయ్యా ఓ యాక్సిడెంట్‌లో పోయారు. అమ్మ నా దగ్గరే ఉంటుంది

కోకిల మాటలకు ఎందుకో తెలియని సంతోషం కలిగింది - కూతురయినా తల్లిని చివరి రోజుల్లో చూస్తున్నందుకు.

కోకిల వాళ్ళు అపార్ట్‌మెంట్స్‌లో వుంటున్నారు. సొంత ఫ్లాటే అట! వాళ్ళాయన ఓ టైర్ల కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడట.

ఓ బెడ్‌రూమ్‌లో మంచం మీద నిస్త్రాణంగా పడుకుని వుంది భగవతి ఆంటీ. బాగా శుష్కించి పోయి ఉంది. ఆనాటి గాంభీర్యం, వాత్సల్యపూరితమైన ఆమె ముఖం ఇప్పుడు ముడతలు పడింది.

గదిలో ఒకరకమైన వాసన...

సారీ! గోపి... అమ్మ మంచం మీద నుంచి లేవలేదు. షుగర్... మొన్ననే బైపాస్ సర్జరీ చేశారు. దాదాపు హాస్పిటల్ బిల్లుతో కలిపి, లక్షన్నర అయింది అని చెప్పింది కోకిల.

తినడానికి ఓ ప్లేట్‌లో అరటిపళ్ళ చిప్స్ ఇచ్చింది.

నేను తింటుంటే చాలా విషయాలు చెప్పుకొచ్చింది కోకిల.

పేరుకి అమ్మ ఫ్లాట్ కొనిచ్చిందన్న మాటేగాని... ఎంత ఖర్చో ఆలోచించు! ఆపరేషన్ లక్షన్నరా... ఇంతకాలం ఆవిడ పోషణ, మందులు ఇవన్నీ ఎవరన్నా పట్టించుకుంటారా?

బాబోయ్... బెడ్‌రూమ్‌నే ఒకోసారి బాత్‌రూమ్ చేస్తుంటుంది. వెధవ కంపు!

దగ్గరకొచ్చి కూర్చోమని ఏడుస్తుంటుంది. తనకి చావు రాదు గాని, మమ్మల్ని చంపుకుని తింటుంది.

ఒకోసారి ఎంత వళ్ళు మండిపోతుందంటే, ఆవిడగారి పీక పిసికేద్దామా అన్పిస్తుంది...

నా చేతిలోని ప్లేట్ జారి కింద పడిపోయింది.

తన ప్రాణం, రక్తం పంచి పెట్టి, పుట్టక మునుపు నుంచే కడుపులో పెట్టుకుని పెంచిన తల్లి... ని పీక పిసకాలనుకోవడమా?

కొడుకులకు ప్రేమ లేకపోయినా, కూతుళ్ళకు అయినా వుంటుందనుకున్నాను.

ఇలాంటి సంతతిని పెంచడానికేనా తల్లిదండ్రులు అన్ని పాట్లు పడేది. నిజ జీవితంలో అంత ఆనందాన్ని త్యాగం చేసేది?

నాకూ... నా కొడుకులు గుర్తొచ్చారు.

వాళ్ళు లైఫ్‌లో బాగా సెటిల్ కావాలనే నేను పెరిగిన వూరుని వదిలేసి, పరాయి దేశంలో బతుకుతెరువు వెదుక్కున్నది.

వీకెండ్‌లో పిల్లలు నాతో గడపటానికి ఇష్టపడరు. వాళ్ళ ఫ్రెండ్స్‌తో బయటికి వెళ్ళిపోతుంటారు.

అలాంటి పిల్లలు పెద్దయ్యాక నన్నూ, లీలను చూస్తారా?

• • •

లీల పుట్టింటి వూరు పట్నమే!

మేడ మీద గదిలో మాకు బస ఏర్పాటు చేశారు.

బంధువుల పిల్లలతో మా వాళ్ళు విక్కీ (విక్రమ్); నిక్కీ (నిఖిల్) అంత చనువుగా మెసలడంలేదు. పైగా బోర్ కొడుతుందని ఒకటే గోల.

కూడా లాప్‌టాప్ తీసుకొచ్చాను. ఆ వూరికి చేరుకోగానే ఫోన్ కనెక్షన్ పీకేసి, లాప్‌టాప్‌కి కనెక్ట్ చేశారు.

ఇక లాప్‌టాప్ ఓపెన్ చేసి, నెట్ చూస్తున్నారు. బంధువుల పిల్లలకు అదో వేలంవెర్రిగా మారింది.

నేనా గొడవకి, హడావుడికి దూరంగా వేరే గదిలో వున్నాను. లీల ఆ రోజు సాయంత్రం కాలీఫ్లవర్ పకోడీలు తీసుకొచ్చి, నా పక్కనే పెట్టి కూర్చుంది.

లీలా విక్కీని - నిక్కీని ఇక్కడ వదిలేద్దామా? అమెరికాలో వదిలేద్దామా?

వదిలేయడమేమిటి? అయోమయంగా చూస్తూ, అడిగింది లీల.

ఇంతవరకూ పోషించింది చాలు - ఇక వాళ్ళ చదువు సంధ్య చూడాల్సిన అవసరం మనకు లేదు. పదహారేళ్ళొచ్చాయి కాబట్టి, ఏదో పని చేసుకుంటూ, వాళ్ళ పొట్ట పోసుకుంటూ చదువుకుంటారు సీరియస్‌గా చెప్పాను.

మందు కొట్టారా - తిక్కతిక్కగా మాట్లాడుతున్నారు! కన్నకొడుకుల్ని రోడ్ల మీద దిక్కుమాలిన వాళ్ళల్లా వదిలేయడమేమిటి? నా బంగారు తండ్రులను పట్టుకుని ఇలాంటి మాటలనడానికి మీకు నోరెలా వచ్చింది? లీల కళ్ళల్లో నీళ్ళు ప్రత్యక్షమయ్యాయి.

వాళ్ళు బంగారం కాదు - బంగారపు పూత పూసిన ఇత్తడి బొమ్మలు! ఆ పూత పెళ్ళయ్యాక గానీ కరిగిపోదు. వీళ్ళనింత కష్టపడి పెంచినా, ముసలితనంలో మనల్ని చూస్తారని నమ్మకమేమిటి?

వీళ్ళ కోసం తగలబెట్టే డబ్బు మనం దాచుకుందాం! మన జీవితాలను ఎంజాయ్ చేద్దాం! కొన్నేళ్ళ తర్వాత పిల్లలు మనల్ని చూడటం లేదని ఏడ్చేకన్నా, ఇప్పుడే వాళ్ళతో తెగతెంపులు చేసుకుంటే, కొన్నేళ్ళ తర్వాత అయినా మనసు కుదుటపడుతుంది ఆవేశంగా అరిచాను.

ఏమైంది మీకు? దగ్గరకొచ్చి, అనునయంగా నా తల మీద చేయి వేసింది లీల.

రాఘవరావు బాబాయి, భగవతి ఆంటీ జీవితాల గురించి వివరించాను.

అందరు తల్లిదండ్రుల్లాగా మనం మోసపోవద్దు! ముందుగానే కళ్ళు తెరుద్దాం. ఈ మోహపాశాలకు, బంధాలకు, త్యాగాలకు లొంగిపోవద్దు!

ఇప్పుడు తల్లిదండ్రుల్ని వదిలించుకుంటున్న ఈ తరం స్వార్థపరులు రేపు పుట్టినప్పుడే బిడ్డల్ని వదిలేయడానికి సిద్ధపడతారు.

ఆ స్వార్థానికి ఈ రోజే మనం శ్రీకారం చుడదాం! వాళ్ళకేనా తెలిసింది - స్వార్థం, సుఖం! మనకూ తెలుసు! మనకీ పిచ్చి సెంటిమెంట్లు ఉండవని చెప్పు! మరింతగా అరిచాను.

ఎందుకంత అప్‌సెట్ అవుతున్నారు? కూల్‌డౌన్! ముందు రిలాక్స్ అవ్వండి! అని నా జుట్టు తన వేళ్ళతో ఆప్యాయంగా సర్దింది లీల.

ఆవేశం, ఆగ్రహం చల్లారినా ఆలోచన మాత్రం ఇంకా రగులుతూనే ఉంది.

• • •

నా నిర్ణయం సమంజసమైనదేనా? ఆ మరుసటి రోజు ఉదయం తాపీగా కాఫీ తాగుతూ, ఆలోచిస్తున్నాను.

నిఖిల్ పరిగెత్తుకుంటూ వచ్చాడు - షాకింగ్ న్యూస్ డాడ్... షాకింగ్ న్యూస్ అంటూ.

ఏమిటి? అంటూ వాడి వెనకే వెళ్ళాను. లాప్‌టాప్‌లో ఆ రోజు న్యూయార్క్ టైమ్స్ ఫ్రంట్ పేజీ ప్రత్యక్షమైంది.

బిగ్ షాట్... షాట్ డెడ్ అనే హెడ్‌లైన్స్ కనబడ్డాయి.

వెంటనే మెయిన్ స్టోరీ ఓపెన్ చేశాను. స్టేట్స్‌లో పేరొందిన రెడీమేడ్ గార్మెంట్స్ తయారీదారుడిని ఓ టీనేజర్ కాల్చి చంపేశాడు.

విక్రమ్, నిఖిల్ ఆ హత్య గురించే మాట్లాడుకుంటున్నారు.

రిలేటెడ్ స్టోరీస్ క్లిక్ చేశాను.

ఆ హంతకుడు ఓ పెర్వర్టెడ్ కిల్లర్.

సడన్‌గా విక్రమ్ అరిచాడు - డాడ్ - వీడు హైస్కూల్‌లో మా క్లాస్‌మేట్! ఆ కుర్రాడి బయోగ్రఫీలోని ఎడ్యుకేషన్ వివరాలు చూసి, ఆ మాట చెప్పాడని అర్థమైంది.

నిజంగానే షాక్ అయ్యాను. విక్రమ్ ఆ కుర్రాడి గురించి చెప్పసాగాడు.

ఆ కుర్రాడి తల్లిదండ్రులు చిన్నతనంలోనే విడాకులు తీసుకున్నారట. కుర్రాడ్ని వదిలేశారు. వాడు గాలికి పెరిగాడు.

ముళ్లపొదకి అయినా కంచె ఉండాలి. లేకపోతే ఎంత అస్తవ్యస్తంగా పెరుగుతుందో చెప్పలేం.

డిప్రెషన్ నుంచి పెర్వర్షన్‌లోకి మళ్ళాడు. రౌడీయిజంతో కృత్రిమమైన ఆనందం పొందేవాడు స్కూల్‌లైఫ్‌లో. సహజంగానే క్రిమినల్ గ్యాంగులతో పరిచయాలు పెరిగి, మత్తుమందులకు బానిస అయి, థ్రిల్ కోసం నేరాలు చేయడం ప్రారంభించాడు. చివరికి సైకో కిల్లర్‌గా మారిపోయాడు.

నేను బయటికొచ్చి, పెరట్లో వున్న మామిడి చెట్టుకేసే చూస్తూ, సిగరెట్ వెలిగించాను.

ఎంతవరకూ వచ్చింది మీ నిర్ణయం? నా వెనకనే వచ్చి, అడిగింది లీల.

ఇంకా ఏమీ లేదు!

మీరన్న మాటలు అక్షర సత్యం! ఈ తరం పిల్లలకు తల్లిదండ్రుల పట్ల బాధ్యతా లేదు, కృతజ్ఞతా లేదు. అలాగని వారిని చిన్నప్పుడే గాలికొదిలేయ గలమా?

ఆ కుర్రాడ్ని చూడండి - తల్లిదండ్రులు బాధ్యతా రహితంగా వదిలేయడం వల్ల సకల దుర్లక్షణాలకు బానిసయ్యాడు. చివరికి కిరాతకుడిగా మారి, హత్యలు చేశాడు.

రేపటి జీవితంలో ఎన్నో వెలుగు రేఖలు చూడాల్సిన పిల్లల జీవితాలు ఇలా చీకటి కాకూడదు!

వాళ్ళు మనల్ని చూడాలని, పోషించాలనే ఆశతో వారిని పెంచొద్దు! మంచి వాళ్ళుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిద్దాం!

నది నలుగురి దప్పిక తీర్చడానికి, వారి జీవితాన్ని సస్యశ్యామలంగా పండించడానికి ప్రయత్నిస్తుందే తప్ప, తన నీళ్ళు తానెన్నడూ తాగదు. ★